సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



బోనమో పోచమ్మతల్లి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మతల్లికి బోనాలు తీశారు . మడేలేశ్వర జాతర సందర్భంగా బోనాలు తీశారు.



ప్రసూతి మరణాలు తగ్గించాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రసూతి మరణాలు తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

- వివరాలు 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'పది' ఇంటర్నల్ మార్కులు పరిశీలించాలి



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఏటా నిర్వహించే ఇంటర్నల్ పరీక్షలు, మూల్యాంకనం మార్కులను పరిశీలించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సూచించారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను బుధవారం సమీక్షించారు. ఈనెల 17 వరకు మానిటరింగ్ సభ్యులు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి తనిఖీలు చేసి 29 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

కార్మిక హక్కులు సాధిస్తాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కార్మిక, కర్షక హక్కులను సాధిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ పేర్కొన్నారు. ఈనెల 16న అన్ని ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మెను అన్ని రంగాల కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. మూశం రమేశ్, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, రవీందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కుష్టును నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ రజిత

సిరిసిల్లటౌన్: కుష్టు వ్యాధిని సమగ్రంగా నిర్మూలించేందుకు లెప్రసీ నోడల్ పర్సన్స్ కృషిచేయాలని జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిత కోరారు. డీఎంహెచ్‌వో ఆఫీసులో బుధవారం వైద్యాధికారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 34 మంది కుష్టు రోగులు ఉన్నారని, వ్యాధిని ప్రారంభదశలో గుర్తిస్తే నివారించవచ్చన్నారు. డీపీఎంవో చేపూరి శ్రీనివాస్, హెచ్‌ఈ బాలయ్య రేవూరి కాశీనాథం, కూన సురేశ్, రెబెల్లి శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



తంగళ్లపల్లిలో ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

సిరిసిల్ల: తంగళ్లపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు బిల్లుల ప్రకారం విక్రయిస్తున్నారా.. లేదా పరిశీలించారు. ప్రతి కొనుగోలుదారుడికి విధిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో పొలాలను పరిశీలించారు. తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట వ్యవసాయాధికారులు సందీప్, భూంరెడ్డి ఉన్నారు.

అజ్మతుల్లా హుస్సేన్‌కు సన్మానం



అజ్మతుల్లా హుస్సేన్‌ను సన్మానిస్తున్న చీటి ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన గంభీరావుపేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు కలిసి, సన్మానించారు. ఉమేశ్‌రావు మాట్లాడుతూ అజ్మతుల్లా హుస్సేన్ కాంగ్రెస్‌లో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు.

మిగిలింది పెద్ద రైతులే !

- చిన్న, సన్నకారు రైతులకు రైతుబంధు చెల్లింపులు
- ఇప్పటికే 1,00,420 మంది ఖాతాల్లో జమ
- మిగిలిన రైతులు 34,305 మంది
- చెల్లించాల్సింది రూ.69.89కోట్లు



జిల్లాలో రైతుబంధు చెల్లింపులు ఇలా..

రైతులు	: 1,34,725
రైతుబంధు మొత్తం	: రూ.132,50,17072
ఇప్పటి పొందిన రైతులు	: 1,00,420
ఖాతాల్లో జమైన మొత్తం	: రూ.62,61,08,579
ఇంకా రావాల్సిన రైతులు	: 34,305
చెల్లించాల్సిన మొత్తం	: రూ.69,89,08,493

మండలాల వారీగా రైతుబంధు

మండలం	రైతులు	రైతుబంధు మొత్తం	పొందిన రైతులు	జమయిన మొత్తం
గంభీరావుపేట	12,853	రూ.11,02,53,854	10,283	రూ.6,06,75,202
ఇల్లంతకుంట	17,934	రూ.19,66,72,874	12,843	రూ.8,28,26,499
ముస్తాబాద్	14,825	రూ.15,21,14,685	11,207	రూ.7,07,93,178
సిరిసిల్ల	4,872	రూ.3,33,83,755	3,446	రూ.1,77,44,025
తంగళ్లపల్లి	13,537	రూ.13,12,91,770	9,917	రూ.6,05,00,759
వీర్నపల్లి	4,554	రూ.3,88,68,036	3,840	రూ.2,56,01,978
ఎల్లారెడ్డిపేట	12,772	రూ.12,16,95,054	9,749	రూ.6,02,82,207
బోయినపల్లి	10,948	రూ.11,02,32,342	8,223	రూ.4,94,69,922
చందుర్తి	10,421	రూ.11,17,44,303	7,469	రూ.5,05,92,409
కోనరావుపేట	12,985	రూ.13,11,28,444	9,752	రూ.6,51,79,243
రుద్రంగి	3,811	రూ.4,31,16,682	2,713	రూ.1,96,53,250
వేములవాడ	7,102	రూ.6,27,76,659	5,091	రూ.2,68,46,779
వేములవాడరూరల్	8,111	రూ.8,17,38,614	5,887	రూ.3,59,43,128

సిరిసిల్ల: రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు సన్న, చిన్నకారు రైతులకు తొలి ప్రాధాన్యంగా చెల్లించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో వరినాట్లు పూర్తయ్యాయి. ముందుగా వరినాట్లు వేసిన రైతులు ముదురుకలుపు తీస్తున్నారు. పెట్టుబడి సాయం కోసం నిరీక్షిస్తుండగా.. నాలుగెకరాలలోపు భూమి ఉన్న రైతులకు విడతలవారీగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. నాలుగెకరాలకు మించి భూమి ఉన్న రైతులకు ఇంకా రైతుబంధు అందలేదు.

ఎకరానికి రూ.5 వేలు

రైతుబంధు సాయంగా ఎకరానికి రూ.5వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏటా అక్టోబర్, నవంబరు నెలల్లో ధరణి పోర్టల్‌లోని భూమి లెక్కల ప్రకారం ఎకరానికి రూ.5వేలు చెల్లిస్తున్నారు. గతంలోనూ ఇంతే మొత్తంలో చెల్లింపులు జరిగాయి. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడంతో రైతుబంధు చెల్లింపుల్లో జాప్యమైంది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మారుతుందని భావించిన ఎన్నికల సంఘం రైతుబంధు చెల్లింపులను నవంబరులో నిలిపివేసింది. దీంతో డిసెంబరు నెలాఖరులో రైతుబంధు చెల్లింపులు మొదలయ్యాయి. ఒక్క గుంట నుంచి అర ఎకరంలోపు రైతులకు ముందుగా చెల్లించారు. ఆ తర్వాత ఎకరంలోపు, రెండు ఎకరాలలోపు చెల్లిస్తూ.. ప్రస్తుతం మూడు ఎకరాలకు మించి చెల్లించారు. రైతుబంధు సాయం చిన్న, సన్నకారు రైతులకు ముందుగా చెల్లింపులు జరిగాయి. నాలుగు ఎకరాలున్న రైతులకు ఇంకా రైతుబంధు సాయం అందలేదు.

యాసంగి వరినాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 1,52,962 ఎకరాల్లో యాసంగి సీజన్‌లో వరినాట్లు పూర్తయ్యాయి. ముందుగా వరినాట్లు వేసిన రైతులు ముదురు కలుపు తీస్తున్నారు. పక్షం రోజుల కిందటే వరినాట్లు పూర్తిచేసిన రైతులు ఉన్నారు. వ్యవసాయ సీజన్‌లో పొలం దున్నేందుకు ట్రాక్టర్‌కు, ఎరువులకు, విత్తనాలకు, కూలీలకు రైతులకు డబ్బులు అవసరం ఉంటాయి. రైతులకు సీజన్‌కు ముందే రైతుబంధు సాయం జమయ్యేది. ఈసారి మాత్రం ఆలస్యంగా చిన్న, సన్నకారు రైతులకు డబ్బులు వేసి, పెద్ద రైతులకు వేయలేదు. డబ్బులు రాని వారు రైతుబంధు కోసం నిరీక్షిస్తున్నారు.

రైతుబంధు రాలేదు



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. గతంలో రైతుబంధు సాయం పడేది. ఈసారి ఇప్పటి వరకు ఇంకా రైతుబంధు రాలేదు. వరినాట్లు వేసి 20 రోజులైంది. అక్కడ.. ఇక్కడ అప్పు చేసి యాసంగి సీజన్‌కు పెట్టుబడి పెట్టిన. రైతుబంధు డబ్బులు వస్తే అందరికీ ఇయ్యాలే. – దేశవేణి గంగాధర్, రుద్రంగి

వరినాట్లకు అప్పోసప్పో చేసినం



మాది గంభీరావుపేట మండలం నర్మాల. నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇప్పటి వరకు నాకు రైతుబంధు రాలేదు. మూడెకరాల వరకు డబ్బులు వచ్చినయి. మేం అప్పోసప్పో చేసి వరినాట్లు వేసినం. రైతుబంధు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నం. – ఆకునూరి వెంకటస్వామి, నర్మాల

నాకు పదకొండు ఎకరాలు..



మాది బోయినపల్లి మండలం తడగొండ. నాకు పదకొండు ఎకరాలు ఉంది. వరి, చెరుకు, నువ్వులు, పెసర పంటలు వేశాను. నాకు పెట్టుబడి సాయం అందలేదు. గతంలో ముందుగానే డబ్బులు వచ్చేవి. ఈసారి యాసంగి సీజన్‌లో పెట్టుబడికి ఇబ్బందిగా ఉంది. – సారబుడ్ల నర్సింహారెడ్డి, తడగొండ

నేరుగా రైతుల ఖాతాల్లోనే..



నేరుగా రైతుల ఖాతాల్లోనే రైతుబంధు సాయం జమవుతుంది. ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం నేరుగా అందుతాయి. ఇప్పటి వరకు మూడు ఎకరాల వరకు, నాలుగు ఎకరాలలోపు డబ్బులు వచ్చినట్లు సమాచారం . దశలవారీగా అందరికీ అందుతాయి. – భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

పోషకాహార లేమికి 'సిరిపోషణ'

- మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- వినియోగించుకోవాలని సూచన



పోతుగల్‌లో గర్భిణీకి రాగిలడ్డు తినిపిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజం కోసం సిరిపోషణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ పేర్కొన్నారు. పోషకలేమి నివారణకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో సిరిపోషణ పథకాన్ని అమలు చేస్తుండగా.. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో వాకాటి కరుణ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో వారానికోసారి రాగిలడ్డూలు, రాగిజావ, మొలకెత్తిన విత్తనాలు ఇస్తారని వివరించారు. వైద్య ఆరోగ్య రంగంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో 40 శాతం ఎనీమియాతో బాధపడుతున్నారని, 30 శాతం మంది చిన్నారులు వయసుకు తగిన బరువు లేరన్నారు. మహిళలు కుటుంబం గురించి ఆలోచించి, వారి ఆరోగ్యాన్ని మరచిపోతారన్నారు. ఈనేపథ్యంలోనే ప్రభుత్వం సిరిపోషణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు సిరిపోషణను ప్రారంభించామన్నారు. జిల్లాలోని 587 కేంద్రాల్లో 41వేల మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ గౌతమి, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవో అలేఖ్య, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి గీతాంజలి, సూపర్‌వైజర్ అరవింద, అంగన్‌వాడీ టీచర్లు గీత, అనురాధ, పద్మ పాల్గొన్నారు.

కలెక్టర్ అనురాగ్ పనితీరు భేష్

రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా అనురాగ్ జయంతి ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని వాకాటి అరుణ అభినందించారు. జిల్లాలో విద్య, వైద్యరంగం పనితీరు బాగుందన్నారు. విద్య, వైద్యం పేదలకు అందించేందుకు కలెక్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవడం ద్వారానే మిల్లెట్‌ఫుడ్ అందించడం జరుగుతుందన్నారు.

రాజన్నసేవలో వాకాటి కరుణ

వేములవాడ: రాజన్నను రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేశ్ స్వాగతం పలికారు.

జిల్లాలో వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

- జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్

సిరిసిల్ల: జిల్లాలో వాలీబాల్ చాంపియన్‌షిప్–2024 నిర్వహిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహిస్తున్నామని రాందాస్ వివరించారు. ఆసక్తి గల యువతీ, యువకులు తమ జట్ల వివరాలను కలెక్టరేట్‌లోని యువజన, క్రీడాశాఖ అధికారి ఆఫీస్‌లో ఈనెల 15లోగా అందించాలన్నారు. ఒక్కో టీమ్‌కు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని, జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని రాందాస్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన మహిళలు, పురుషుల జట్లకు వేర్వేరుగా నగదు బహుమతితోపాటు ట్రోఫీని కలెక్టర్, ఎస్పీల చేతులమీదుగా అందిస్తామని వివరించారు. పోటీలు నిర్వహించే తేదీలను, క్యాష్‌ప్రైజ్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. జట్ల వివరాలను నమోదు చేసుకునేందుకు 94402 39783, 90594 65889, 75692 07411 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు



ఠాణా దివస్‌కు హాజరైన జనం

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఠాణా దివస్
- భూములను ఆక్రమిస్తే పీడీయాక్ట్
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఠాణాదివస్‌లో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజలకు మరింత చేరువగా సేవలందించడమే లక్ష్యంగా జిల్లాలో ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బుధవారం ఠాణాదివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 68 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఆరు మండలాల్లో ఠాణాదివస్ పూర్తి చేసినట్లు తెలిపారు. పోలీస్ కమ్యూనిటీ ద్వారా ప్రజలతో మమేకమవుతూ శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నట్లు తెలిపా రు. షీటీమ్, సఖీ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. భూములు ఆక్రమించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఠాణా దివస్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు 57 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. డీఎస్పీ ఉదయ్ రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకం

నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మండలంలోని తుర్కపల్లిలో అంబేడ్కర్ సంఘం, ట్రాక్టర్ అసోసియేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాశోల్ల పద్మ, దుర్గాప్రసాద్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు కర్రోల్ల నర్సయ్య, లింగం, రంజిత్, ప్రవీణ్, నర్సింలు, దుర్గయ్య, ఎల్లయ్య, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్ సంఘ సభ్యులకు కండువా కప్పిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడరూరల్ మండలం నమిలిగుండుపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు, తుర్కాషినగర్, ఫాజుల్‌నగర్ గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో ప్రజలు మార్పుకోరి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారన్నారు. మీరు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రభుత్వం విప్‌గా అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని, త్వరలోనే రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలవుతాయని వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సర్పంచ్ కరుణాకర్, రూరల్ మండల సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 15వ వార్డు కౌన్సిలర్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ కవితారెడ్డి తిరుమల్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి దంపతులు బుధవారం బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. గతంలో మున్సిపాలిటీలో ఆరుగురు సభ్యులతో ఉన్న బీజేపీ ప్రస్తుతం ముగ్గురికే పరిమితమైంది.

మార్కండేయ శోభాయాత్రకు రండి..





మంత్రి కొండా సురేఖ, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌లకు ఆహ్వానపత్రికలు అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్లలో ఈనెల 12న నిర్వహించే శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రకు రావాల్సిందిగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖను సిరిసిల్ల పద్మశాలి సంఘం మహిళా నాయకులు ఆహ్వానించారు. ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం కొండా సురేఖను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావును సైతం కలిసి మార్కండేయ శోభాయాత్రకు రావాల్సిందిగా ఆహ్వానించారు. సంఘం నాయకులు ఆహ్వానించారు. పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, బీఆర్ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, పద్మశాలి మహిళా నాయకురాలు కాముని వనిత, గుజ్జె తార, ఆడెపు చంద్రకళ, డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమను ఆదుకోవాలి

- కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించాలి
- యారన్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలి
- చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు



చేనేత, జౌళిశాఖ ఆఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ కోరారు. సిరిసిల్ల నేతకార్మికుల సమస్యలపై బుధవారం స్థానిక చేనేత, జౌళిశాఖ ఆఫీసు ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వం తరఫున ఇతర వస్త్రాల ఆర్డర్లను సిరిసిల్లకు ఇప్పించాలని కోరారు. పవర్‌లూమ్ కార్మికులకు రావాల్సిన బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే అందించాలన్నారు. పవర్‌లూమ్, వార్పిన్, వైపని, అనుబంధ రంగాల కార్మికులకు సరైన ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభ నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సిరిసిల్లలో దాదాపు 5,200 మంది నేతన్నలకు యారన్ సబ్సిడీ రాలేదన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, మండల రాజు, ఉడుత రవి, సిరిసిల్ల సత్యం, కిషన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసిన మండెపల్లి నాయకులు



కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్న మండెపల్లి నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను బుధవారం మండెపల్లి నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. మండెపల్లిలో రూ.50 లక్షలతో నిర్మించే మహంకాళి దేవాలయ శంకుస్థాపనకు హాజరు కావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి, సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఎంపీటీసీ బుస్స స్వప్న, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 24 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌మీట్‌కు జిల్లా మాస్టర్ అథ్లెట్స్ అసోసియేషన్ కార్యదర్శి గొట్టిముక్కల శేఖర్ ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. అథ్లెట్ ఎం.లక్ష్మి 1500 మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది. వీరిని అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు చీటి నర్సింగరావు, జిల్లా క్రీడాధికారి అజ్మీర రాందాస్, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు దేవత ప్రభాకర్, గొట్టె అంజయ్య, రవికుమార్, బొద్దు నారాయణ తదితరులు అభినందించారు.

వేములవాడ రూరల్ సీఐగా శ్రీనివాస్

సిరిసిల్లక్రైం: పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్‌లో ఐటీకోర్ విధుల నిర్వహిస్తున్న మందాటి శ్రీనివాస్‌ను వేములవాడ రూరల్ సీఐగా, వెయిటింగ్ జాబితాలో ఉన్న టి.సంజీవ్‌ను సిరిసిల్ల డీసీఆర్బీ సీఐగా నియమిస్తూ ఐజీ తరుణ్‌జోషి బుధవారం ఉత్తర్వులు వెల్లడించారు. ఇప్పటి వరకు వేములవాడరూరల్ సీఐగా విధులు నిర్వహించిన వై.కృష్ణకుమార్‌ను మల్టీజోన్–1 కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జనశక్తి మాజీ నక్సలైట్‌పై పీడీయాక్టు



కుంటయ్యకు పీడీయాక్టు ఉత్తర్వు కాపీని అందిస్తున్న సీఐ కరుణాకర్

సిరిసిల్ల క్రైం: జనశక్తి మాజీ నక్సలైట్ మానుక కుంటయ్యపై పీడీయాక్టు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి పార్టీలో పని చేసి, అనంతరం లొంగిపోయాడు. భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరించి, డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇప్పటికే అతనిపై 8 కేసులు నమోదవగా.. తీరు మార్చుకోకపోవడంతో పోలీసులు ఇటీవల రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయినప్పటికీ ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత ఉత్తర్వు కాపీని సీఐ కరుణాకర్ బుధవారం కుంటయ్యకు అందించి, చర్లపల్లి జైలులో అప్పగించారు.

సెస్‌పై బకాయిల భారం

- రూ.80కోట్ల పెండింగ్ బిల్లులు
- ప్రభుత్వ కార్యాలయాలవే అధికం
- ఇండస్ట్రీస్ బకాయిలు రూ.9 కోట్లు
- సెస్‌లో 2.73 లక్షల విద్యుత్ కనెక్షన్లు
- స్ట్రీట్‌లైట్లు, వాటర్ బిల్లులే రూ.18 కోట్లు



ముస్తాబాద్(సిరిసిల్ల): ఐదు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలకు అత్యుత్తమ సహకార సేవలు అందిస్తున్న సిరిసిల్ల సహకార విద్యుత్ సంఘం లిమిటెడ్(సెస్)కు పెండింగ్ బిల్లులు గుదిబండగా మారాయి. సహకార వ్యవస్థలో దేశంలోనే మంచి పేరున్న సెస్ మనుగడపై బకాయిలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల బిల్లులు చెల్లించడం లేదని సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ విద్యుత్ కనెక్షన్‌ను తొలగించడం సంచలనంగా మారింది. ఈనేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాసేవకు వినియోగించే విద్యుత్ బిల్లుల విషయం చర్చనీయాంశంగా మారింది.

వీధిదీపాలు, వాటర్‌వర్క్స్ బిల్లులే ఇబ్బంది

సెస్ సంస్థ ఎన్పీడీసీఎల్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తుంది. సెస్ పరిధిలో ఏ సమస్య వచ్చిన 24 గంటల్లో పరిష్కరించడంతోపాటు ప్రతీ నెల బిల్లులు వసూలు చేస్తుంది. ఈక్రమంలో చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సెస్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల బిల్లులే అధికంగా ఉన్నాయి. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే వీధిదీపాలు, తాగునీటి సరఫరాకు వినియోగించే మోటార్ల బిల్లులు పెండింగ్ పడ్డాయి. వీటి బిల్లులు లక్షల్లో రావడంతో పాలకవర్గాలకు భారంగా మారింది. నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతోనే ఇటీవల సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల విద్యుత్ కనెక్షన్లను సెస్ అధికారులు తొలగించారు. పోలీస్‌స్టేషన్లు, క్వార్టర్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు సకాలంలో చెల్లించే పరిస్థితులు లేవు. ఇదే సెస్‌కు ఇబ్బందిగా మారింది. బకాయిల వసూళ్లకు సెస్ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నా భారీగా పెండింగ్ పడుతున్నాయి. సెస్ నూతన పాలకవర్గం పగ్గాలు చేపట్టక ముందు నెలకు రూ.7కోట్ల వరకు బిల్లులు వసూలుకాగా.. దీనిని రూ.15 కోట్లకు తీసుకెళ్లారు. ఇదే సమయంలో విద్యుత్ వినియోగ డిమాండ్ రెండింతలైంది.

శాఖల వారీగా బకాయిలు ఇలా..

కేటగిరీ ఒకటి(గృహాలు)	: రూ.28 కోట్లు
కేటగిరీ రెండు(కమర్షియల్)	: రూ.9.80 కోట్లు
కేటగిరీ మూడు(పరిశ్రమలు)	: రూ.9 కోట్లు
కేటగిరీ నాలుగు(చేతివృత్తులు)	: రూ.1.50 కోట్లు
కేటగిరీ ఐదు(వ్యవసాయం)	: రూ.8.50 కోట్లు
కేటగిరీ ఆరు(జీపీలు, వీధిదీపాలు)	: రూ.4 కోట్లు
కేటగిరీ ఏడు(గుడులు, బడులు)	: రూ.18 కోట్లు

విద్యుత్ కనెక్షన్లు ఇలా..

గృహ కనెక్షన్లు	: 1,69,167
కమర్షియల్,	: 18,853
పరిశ్రమలు,	: 1,590
చేతివృత్తులు,	: 4,770
వ్యవసాయం	: 75,084
స్ట్రీట్‌లైట్లు, వాటర్ వర్క్స్	: 3,149
గుడులు, బడులు	: 1,035

సెస్‌ను కాపాడుకునే బాధ్యత అందరిది



మేము పగ్గాలు చేపట్టాక పెండింగ్ బిల్లుల వసూళ్లపై దృష్టి పెట్టాం. విద్యుత్ కొనుగోలు చేసే చోట కోట్లలో బకాయిలు ఉన్నాయి. నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయి. అందరూ సకాలంలో బిల్లులు చెల్లించి సెస్‌ను కాపాడుకోవాలి. రైతులు, గృహ, పరిశ్రమలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. – చిక్కాల రామారావు, సెస్ చైర్మన్

పంచాయతీల బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి



స్ట్రీట్‌లైట్లు, నీటి సరఫరాకు వినియోగిస్తున్న కరెంట్ బిల్లులు పంచాయతీలకు భారంగా మారాయి. వచ్చిన నిధులను బిల్లుల చెల్లింపులకు వాడుతున్నాం. ప్రభుత్వమే పంచాయతీల కరెంట్ బిల్లులు చెల్లించాలి. – గాండ్ల సుమతి, మాజీ సర్పంచ్, ముస్తాబాద్

ప్రసూతి మరణాలు తగ్గించాలి

- మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల: మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రసూతి మరణాలు తగ్గేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా వైద్యాధికారులతో సమీక్షించారు. ప్రసూతి సమయంలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గతంలో ప్రభావితం చేసిన అంశాలను అధిగమించాలన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో మృతిచెందిన గర్భిణులు, శిశువుల వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. మృతికి గల కారణాలు, భవిష్యత్‌లో సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. గర్భిణులకు చెకప్‌లతోపాటు హైరిస్క్ కేసులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. తమ పరిధిలోని గర్భిణులకు ఎలాంటి లక్షణాలు కనిపించినా వెంటనే సంబంధిత మెడికల్ ఆఫీసర్‌కు నివేదించేలా చూడాలని వివరించారు. జిల్లా ఉప వైద్యాధికారులు రజిత, శ్రీరాములు, సిరిసిల్ల జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు సంతోష్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు మహేశ్‌రావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు నయీమా, ఉమ, మెడికల్ ఆఫీసర్లు, ఏ ఎన్ఎంలు, ఆశ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణంపై దాడి

- రూ.35వేల మద్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని చీకోడులో బెల్టు దుకాణంపై మంగళవారం రాత్రి దాడి చేసి రూ.35వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి పేకాడుతున్నారన్న సమాచారంతో సీఐ రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సిరిసిల్లలో చిన్నారి కిడ్నాప్ కలకలం !

- చాక్లెట్ చూపించి ఎత్తుకెళ్లే ప్రయత్నం
- చేతిని కొరికి తప్పించుకున్న వైనం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- సిరిసిల్లలో చర్చనీయాంశం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినికి చాక్లెట్ ఆశ చూపి కిడ్నాప్ చేసేందుకు యత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివే ఎనిమిదేళ్ల చిన్నారి ఉదయం ఇంటర్‌వెల్ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి తరగతిగది నుంచి బయటకొచ్చింది. తల్లిదండ్రుల మాదిరి ఒకరు పాఠశాల పరిసరాలకు చేరి చిన్నారిని రావాలంటూ చేతిలో చాక్లెట్ పట్టుకుని పిలవడంతో దగ్గరకెళ్లింది. చాక్లెట్ ఇచ్చినట్లే ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడంతో.. అప్రమత్తమైన చిన్నారి ఆ ఆగంతకుని చేతిని కొరికి స్కూల్‌లోకి పరుగెత్తింది. దీన్ని గమనించిన స్కూల్ పీఈటీ అక్కడికొచ్చిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. స్కూల్ పరిసరాల్లో సంచరించిన ఆగంతకులను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పామని విద్యార్థులకు యాజమాన్యం తెలిపిందని తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం జరిగిన విషయం తమకు తెలియదని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భయాందోళన చెందుతున్నట్లు తెలిసింది.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తికి జైలు

వేములవాడ: బాలికను కిడ్నాప్ చేసి, అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి ఎన్.ప్రేమలత తీర్పు చెప్పారని వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణానికి చెందిన యారం సాయికిరణ్ 2016 అక్టోబర్ 7న స్థానిక బాలికను కిడ్నాప్ చేసి, ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి, అతన్ని రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి ఎ.శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సైలు శ్రీకాంత్, శ్రవణ్‌యాదవ్, కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్ 14 మంది సాక్షులను హాజరుపరచగా స్పెషల్ పీపీ శ్రీనివాస్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించారు. నేరం రుజువు కావడంతో సాయికిరణ్‌కు బుధవారం శిక్ష ఖరారు చేశారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- విషం తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు



లాస్య(ఫైల్)

సిరిసిల్లక్రైం: అత్తారింటి వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవపూర్‌కు చెందిన బొమ్మగాని స్రవంతి(లాస్య)కి కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రావుల నాగరాజుతో 2018లో వివాహమైంది. సిరిసిల్ల బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే రావుల నాగరాజు, లాస్యకు ఆరేళ్ల పాప, రెండేళ్ల బాబు ఉన్నారు. కానీ భార్యభర్తలిద్దరు మాత్రమే సిరిసిల్ల రాళ్లబావి వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. నాగరాజు మంగళవారం తన విధుల నిమిత్తం బయటకు వెళ్లాడు. అదే సమయంలో లాస్య ఇంట్లోనే ఉంది. తర్వాత కొద్ది సేపటికి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన ఇంటి యజమాని వెంటనే నాగరాజుకు తెలిపాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను నాగరాజు ముందుగా సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాడు. లాస్య అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. అత్తారింటి వాళ్లు కొద్ది రోజులుగా అదనంగా రూ.10 లక్షలు కట్నం తేవాలని వేధించడంతోనే తన కూతురు విషం తాగిందని మృతురాలి తండ్రి బొమ్మగాని రాజేశం ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

ఆటోడ్రైవర్ బలవన్మరణం

కరీంనగర్ క్రైం: అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన బుర్ర కరుణాకర్(44) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం తన భార్య పావని, కుమారుడు, కూతురితో కలిసి, కరీంనగర్ వచ్చాడు. స్థానిక రాంగనర్‌లో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. ఉచిత బస్సు ప్రయాణంతో గిరాకీ లేక ఆటో ఫైనాన్స్ చెల్లించలేక, అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ వద్ద క్రిమిసంహారక మందు తాగి, భార్యకు ఫోన్ చేసి, విషయం చెప్పాడు. ఆమె ఆటోడ్రైవర్ల సంఘం నాయకులతో కలిసి, సంఘటన స్థలానికి వెళ్లగా అతను కింద పడిపోయి ఉన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అధైర్యపడొద్దు అండగా మేమున్నాం..



వాకాటి కరుణకు వినతిపత్రం ఇచ్చిన అంగన్‌వాడీలు

- వృద్ధులతో రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- మండెపల్లి ప్రభుత్వ వయోవృద్ధుల కేంద్రం, కేజీబీవీ సందర్శన

తంగళ్లపల్లి(సిరిసిల్ల)/సిరిసిల్లటౌన్: ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందిన వృద్ధులు అధైర్యపడొద్దని అండగా ఉన్నామని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ పేర్కొన్నారు. మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంతోపాటు పద్మనగర్ కేజీబీవీని కలెక్టర్ కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమితో కలిసి సందర్శించారు. వాకాటి కరుణ వృద్ధాశ్రమంలోని 33 మంది వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. భోజనం, మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో గ్రామీణ ప్రాంత కిశోర బాలికల కోసం జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన షేరో ప్రాజెక్టును పరిశీలించారు. తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కేజీబీవీ స్పెషల్ అధికారి శ్యామల పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని అంగన్‌వాడీలు స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణకు వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన టీచర్స్‌కు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ప్రతీ నెల ఒకటో తారీఖునే జీతాలు ఇవ్వాలని, సమ్మె కాలం వేతనాలు ఇప్పించాలని కోరారు. యూనియన్ ఉపాధ్యక్షురాలు ఓరగంటి శ్యామల, కోశాధికారి కొండికొప్పుల పద్మ, రజనీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ముందుచూపుతోనే గోదావరి జలాలు



మద్దికుంట చెరువు మత్తడి వద్ద పూజలు చేస్తున్న రైతులు, నాయకులు

- మద్దికుంట మత్తడి వద్ద రైతుల పూజలు

ముస్తాబాద్(సిరిసిల్ల): కేసీఆర్ ముందుచూపుతోనే గోదావరి జలాలు బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్నాయని ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట ఊరచెరువు గోదావరి జలాలతో మత్తడి దూకగా.. బుధవారం రైతులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆపర భగీరథుడిగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో ముస్తాబాద్, సిరిసిల్ల ప్రాంతాలకు గోదావరి జలాలు అందజేశారని కొనియాడారు. ఎండాకాలంలో మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయడంతో చీకోడు, మద్దికుంట చెరువులు నిండాయని, కొద్దిరోజుల్లో ముస్తాబాద్ పెద్దచెరువుకు నీరు చేరుతుందని తెలిపారు. జింక తిరుపతి, కాశీం, ఎల్లం, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

స్వగ్రామంపై మమకారంతోనే సేవ

- జ్యోతిష్మతి విద్యాసంస్థల అధినేత జువ్వాడి సాగర్‌రావు
- మూడపల్లిలో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్థానికులు

చందుర్తి(వేములవాడ): పుట్టి, పెరిగిన గ్రామంపై మమకారంతోనే సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు జ్యోతిష్మతి విద్యాసంస్థల అధినేత జువ్వాడి సాగర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మూడపల్లి ఎస్సీ కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జువ్వాజి ఆనందరావు జ్ఞాపకార్థం రూ.5లక్షలతో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తన కుటుంబంతో అనుబంధం ఉన్న స్థానికులు పంబ రాములు, లక్కం రత్నయ్యలతో వాటర్‌ప్లాంట్‌ను బుధవారం ప్రారంభింపజేశారు. సాగర్‌రావు మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యంగా ఉండాలని సూచించారు. వేసవి వరకు కూలింగ్ మిషన్‌ను సైతం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు చిలుక అంజిబాబు, సంటి యేసుదాసు, సంటి బాపురావు మాట్లాడుతూ జ్యోతిష్మతి విద్యాసంస్థల అధినేత సాగర్‌రావు సహకారంతోనే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించుకున్నామని గుర్తు చేశారు. నీరటి శ్రీనివాస్, సిరిగిరి కాంతారావు, సిరిగిరి సుధాకర్, బద్దం లచ్చిరెడ్డి, బద్దం మల్లారెడ్డి, బద్దం బాపురెడ్డి, బొప్ప వెంకన్న, కొమ్ము శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన రాజు తనకు భూ సమస్య ఉందని, పరిష్కరించాలని స్థానిక ఓ విలేకరి రమణారెడ్డిని సంప్రదించాడు. అతను రూ.3 లక్షలు, ఆ భూమిలో వంద గజాలు ఇవ్వాలన్నాడు. దీంతో రాజు ముందుగా రూ.లక్ష ఇచ్చాడు. కానీ భూ సమస్య పరిష్కరించకుండానే రమణారెడ్డి మళ్లీ డబ్బులు కావాలని అడిగాడు. అంతేకాకుండా ఈనెల 5న రాజు చంద్రంపేట నుంచి వేములవాడ వెళ్తుండగా బెదిరించి, కులం పేరిట దూషించి, హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రమణారెడ్డి మంగళవారం కోర్టులో లొంగిపోగా జడ్జి ఆదేశాల మేరకు అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సివిల్ గొడవల్లో తలదూర్చి, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కార వేదిక



ఇన్‌చార్జి చైర్మన్ రామకృష్ణను నిలదీస్తున్న విద్యుత్ వినియోగదారులు

- విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఇన్‌చార్జి చైర్మన్ రామకృష్ణ

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే వేదికను నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి చైర్మన్ రామకృష్ణ అన్నారు. మండలకేంద్రంలోని సెస్ భవన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశాన్ని ఇన్‌చార్జి చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లో వోల్టేజీ, లూజ్ వైర్ల సమస్యలపై పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట మండలాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల కోసం డీడీలు చెల్లించినా అధికారులు పనులు చేయడం లేదని, కొందరు ఏఈలు, లైన్‌మెన్లు, హెల్పర్లు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని.. గతంలో ఫిర్యాదులు ఇచ్చినా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. దీంతో చైర్మన్, సభ్యులు, రైతులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ప్రచారం లేకుండా నిర్వహిస్తున్న సమావేశాన్ని రద్దుచేయాలని పట్టుబట్టారు. సెస్‌లో అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. సభ్యులు కిషన్, రాజాగౌడ్, సెస్ ఏడీఈ, ఏఈలు, రైతు కిసాన్ సంఘ్ జోనల్ అధ్యక్షుడు బోయినపల్లి సంపత్‌రావు, నాయకులు దేవయ్య, పోషయ్య పాల్గొన్నారు.

10న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 10న రామడుగు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 94419 25807 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15న జేఎల్ఎం అభ్యర్థులకు స్తంభం ఎక్కే పరీక్ష

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న ఐదోవిడత జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు సర్కిల్ ఎస్ఈ గంగాధర్ ప్రకటనలో తెలిపారు. రిజిస్టర్ పోస్టు ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. రానివారు కరీంనగర్ సర్కిల్ ఆఫీస్‌లో తీసుకోవాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమర్‌నగర్‌కు చెందిన సాయికుమార్(23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. సాయికుమార్ హమాలీగా పనిచేస్తున్నాడు. తన సోదరి పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలోనన్న బెంగతో బుధవారం క్రిమిసంహార మందు తాగాడు.